వేసవి లక్ష్యం.. 11 కోట్ల యూనిట్లు

సౌత్ డిస్కం ఆపరేషన్ విభాగం అంచనా
ఫిబ్రవరి మొదటి వారంలో యాక్షన్ ప్లాన్ పూర్తి చేయాలి: సీఎండీ
డిమాండ్ ఎక్కువగా ఉన్న శివారు ప్రాంతాల్లో కొత్త లైన్లు
ఇన్‌చార్జిలు.. సర్కిళ్ల వారీగా డైరెక్టర్, సీఈ స్థాయి అధికారులు

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ): వేసవిలో గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా విద్యుత్ వినియోగం గతం కంటే ఎక్కువగా ఉంటుందనే అంచనాతో ఎస్పీడీసీఎల్ సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ఈ మేరకు జనవరి చివరికల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించినా పనుల్లో పురోగతి లేకపోవడంతో అధికారులపై సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖి ఆగ్రహం వ్యక్తం చేసి ఫిబ్రవరి మొదటి వారం కల్లా పూర్తి చేయాలంటూ ఆదేశించారు. 2025 వేసవిలో సమ్మర్ డిమాండ్ అత్యధికంగా 11కోట్ల యూనిట్లకు చేరుకుంటుందని సౌత్ డిస్కం ఆపరేషన్ విభాగం అంచనా వేస్తోంది. ఈ మేరకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులకు సూచించారు. అయితే, గతంలో 100 మి.యూ. లోపే విద్యుత్ వినియోగం డిమాండ్ ఉన్నప్పటికీ ఈసారి అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నదని, పెరిగిన కనెక్షన్లు, ప్రభుత్వ పథకాల కారణంగా డిమాండ్ ఎక్కువవుతున్నదని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్న ఉప్పల్, మేడ్చల్, బాచుపల్లి, పటాన్‌చెరు, సంగారెడ్డి, సరూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ లైన్లు వేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో డిమాండ్‌కు తగినట్లు

క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరాపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖి (ఫైల్)

డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో పాటు సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచే దిశగా పనులు చేస్తున్నారు.

వారం రోజుల తర్వాత మళ్లీ డిమాండ్

ఈ నెల 10వ తేదీ వరకు గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతూ వచ్చినప్పటికీ వారం రోజులుగా విద్యుత్ డిమాండ్ పూర్తిగా తగ్గిపోయింది. ఒక వైపు చలి పెరుగుతుంటే మరోవైపు విద్యుత్ వినియోగం తగ్గిందని అధికారులు చెబుతున్నా, సంక్రాంతి సందర్భంగా చాలా మంది వేరే ఊళ్లకు తరలి వెళ్లడంతో వినియోగం తగ్గిపోయింది. మళ్లీ ఈ నెల 20 నుంచి పెరుగుతున్నదని, ఈ నెల 14న 2580 ఎంవీ నమోదు కాగా, 48.7 ఎం.యూ నమోదైంది. ఆదివారం 20వ తేదీన 3261 ఎంవీ నమోదు కాగా 58.8 ఎం.యూ నమోదైంది. మరోవైపు చలితో పాటు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం డిమాండ్ ఇక ముందు పెరుగుతూనే ఉంటుందని అధికారులు తెలిపారు.

శివారు ప్రాంతాల్లో డిమాండ్..!

వేసవిలో నగర శివారు ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మేడ్చల్, సంగారెడ్డి జోన్లలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జోన్‌లో సమ్మర్ డిమాండ్‌కు అనుగుణంగా 81 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో పాటు 1252 డిస్ట్రిబ్యూషన్లు కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. మేడ్చల్ బొరంపేటలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. హబ్సిగూడ సర్కిల్‌లో 90కి పైగా 11 కేవీ ఫీడర్లను విభజించడంతో పాటు 14 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంచుతూ, 545 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను పెంపు లేదా ఏర్పాటు చేస్తున్నారు. ఇక సరూర్‌నగర్‌లో 309, రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 171, సైబర్ సిటీ పరిధిలో 232, హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో 137 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను పెంపు లేదా అదనంగా ఏర్పాటు చేస్తున్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ పూర్తికి కసరత్తు

గ్రేటర్‌లో ప్రతిరోజూ 65 నుంచి 70 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ డిమాండ్ నమోదవుతుండగా, సమ్మర్‌లో 25 నుంచి 30 శాతం మేర అధికంగా నమోదవుతుందని అధికారుల అంచనా. ఈ ఏడాది సమ్మర్‌లో 100 నుంచి 110 మిలియన్ యూనిట్లకు చేరనున్నట్లు డిస్కం అంచనా. గతేడాది రికార్డు స్థాయిలో మే 3న ఒక్క రోజే అత్యధికంగా 89.71 మి.యూ. విద్యుత్ డిమాండ్ నమోదైంది. దీంతో ఈసారి ఏప్రిల్, మేలలో మరింత డిమాండ్ ఉండే అవకాశం ఉందని, ఈ మేరకు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పది సర్కిళ్లలో కొత్త పనులు చేపట్టారు. ఇప్పటికే సెక్షన్ల వారీగా విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ లీకేజీల నియంత్రణ, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులు చేపట్టింది. ఫిబ్రవరి మొదటి వారంలోగా పనులు పూర్తి చేయాలని సీఎండీ ముషారఫ్ ఫారూఖి ఆదేశాలు జారీ చేశారు.

ప్లాన్ అమలుకు ఇన్‌చార్జిల నియామకం

సమ్మర్ యాక్షన్ ప్లాన్ పటిష్టంగా అమలు చేయడానికి గ్రేటర్‌లోని పది సర్కిళ్ల వారీగా డైరెక్టర్, సీఈ స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. వీరంతా కరెంట్ పోకుండా చూడటమే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి డిమాండ్, సరఫరాపై ఆరా తీయడంతో పాటు సాంకేతిక సమస్యలను ముందే గుర్తించి సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూస్తూ. 33 కేవీ, 11 కేవీ ఫీడర్ మరియు పీటీఆర్‌లపై లోడ్‌ను పర్యవేక్షిస్తారు.

తెలంగాణ భవన్‌లో బుధవారం గౌడ శంఖారావం మాసపత్రిక, డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకట వీరయ్య, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, పత్రిక ఎడిటర్ అమరగాని శ్రీనివాస్ గౌడ్, పులి సాయితరుణ్ గౌడ్ తదితరులు

తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం 2025 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

గెజిటెడ్ అధ్యాపకుల డైరీ ఆవిష్కరణ

సుల్తాన్‌బజార్, జనవరి 22: ప్రభుత్వ కళాశాలల్లో వస్తున్న నూతన పోకడలకు అనుకూలంగా అధ్యాపకులు వృత్తి, నైపుణ్యాలు పెంపొందించుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె సురేందర్ రెడ్డి, బెల్లి యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు జే చిన్ను, మహిళా కార్యదర్శి డాక్టర్ ఈ పావనిలతో కలిసి బుధవారం ఆయన తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం 2025 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, క్రమంగా అన్ని సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ం సభ్యులు డాక్టర్ తిరుపతయ్య, డాక్టర్ మహేష్, డాక్టర్ రాజారాం, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, సత్యనారాయణ రెడ్డి, వెంకన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న ఐఆర్‌పీఎస్ అధికారి జీఆర్ఎస్ రావు,బ్యాంక్ ఆఫ్ బరోడా జీఎం రితేశ్‌కుమార్

దక్షిణ మధ్య రైల్వే-బ్యాంక్ ఆఫ్ బరోడా మధ్య ఒప్పందం

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : బరోడా పోలీస్ సాలరీ ప్యాకేజీలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా, సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే బుధవారం ఎంఓయూ కుదుర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఒప్పందంతో వినియోగదారులకు ప్రమాదబీమా, ఉచిత ఆరోగ్య సేవలు, రిటైల్ లోన్స్‌పై ప్రత్యేక ఆఫర్లు, డెబిట్, క్రెడిట్ కార్డుల సౌలభ్యం తదితర ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఐఆర్‌పీఎస్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ జీఆర్ఎస్.రావు, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌పీఎస్ డిప్యూటీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ జయ శంకర్ చౌహాన్, బ్యాంక్ ఆఫ్ బరోడ డీజీఎం ఎంవీఎస్ సుధాకర్, ఏజీఎం అభిషేక్ భర్తి పాల్గొన్నారు.

రామానందతీర్థకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ వాణీదేవి, తదితరులు.

స్వామి రామానందతీర్థ నిస్వార్థ దేశభక్తుడు

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

బేగంపేట్ జనవరి 22: స్వామి రామానందతీర్థ నిస్వార్థ దేశ భక్తుడని రామానంద తీర్థ స్మారక కమిటీ చైర్‌పర్సన్, ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. బుధవారం బేగంపేట బ్రాహ్మణవాడిలోని రామానందతీర్థ కమిటీ ప్రాంగణంలో పూజ్య రామానందతీర్థ 53వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు రామానంద తీర్థ పరిశోధన సంస్థ అధ్యక్షుడు పీవీ ప్రభాకర్‌రావు, సోలార్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శేఖర్ మారం రాజులు పాల్గొని స్వామిజీ సమాధి వద్ద పుష్పాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాణీదేవి, ప్రభాకర్ రావులు మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు స్వామి రామానంద ఎంతో కృషి చేశారని అన్నారు. ఆర్థిక సమానత్వంలేని రాజకీయ స్వాతంత్ర్యం అర్థ రహితమని చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రజాకార్లను ఎదురించి నిలిచిన విప్లవ వీరుడని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం భజనలు గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సిబ్బంది టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్‌లో మరో టన్నెల్?

జేబీఎస్ టూ తూంకుంట మార్గంలో హకీంపేట్ వద్ద అండర్ గ్రౌండ్ రోడ్ వే
హెచ్‌ఎండీఏ సన్నాహాలు

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరానికి తలమానికం కానున్న ఎలివేటెడ్ కారిడార్‌లో మరో టన్నెల్ రానుంది. ఇప్పటికే ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం మార్గంలో నిర్మించనున్న ఎలివేటెడ్ ప్రాజెక్టు కోసం బేగంపేట్ ఎయిర్‌పోర్టు అడ్డంకిగా మారడం... 600 మీటర్ల పొడవైన అండర్ గ్రౌండ్ రోడ్ వే నిర్మాణానికి హెచ్ఎండీఏ సన్నాహాలు చేసింది. దీనికి ఎయిర్‌పోర్టు పరిసరాల నిర్మాణాలపై ఆంక్షలు అడ్డు అవుతుంది. దీనికి పరిష్కారంగా ప్యారడైజ్ నుంచి సుచిత్ర వెళ్లే మార్గంలోనే ఎయిర్‌పోర్టు రన్‌వే కిందనే టన్నెల్ నిర్మిస్తున్నారు. అదే తరహాలో ఇప్పుడు జేబీఎస్ నుంచి తూంకుంట వెళ్లే మార్గంలోనూ మరో టన్నెల్ వచ్చే అవకాశం ఉందని తెలిసింది. లేదంటే హకీంపేట్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఫ్లైఓవర్‌ను కిందకు దించి, అక్కడి నుంచి తూంకుంట వరకు మరోసారి ఎత్తుకు తీసుకుపోవాల్సి వస్తుంది. ఇదీ ఇంజనీరింగ్ పరంగానే కాకుండా.. వ్యయం పరంగాను ఇబ్బందిగా మారనుంది. దీనికి పరిష్కారంగానే హకీంపేట్ ఎయిర్ పోర్టు వద్ద అండర్ గ్రౌండ్ టన్నెల్ నిర్మించడం వలన వాహనదారులు నగరశివారులు దాటి సులభంగా ప్రయాణించడానికి వీలు ఉండేలా హెచ్ఎండీఏ డిజైన్లు ఖరారు చేసింది.

జేబీఎస్ నుంచి ఎత్తు పెరుగుకుంటూ నగర శివారు వరకు డబుల్ డెక్కర్ మీదుగా రాకపోకలు సాగించేందుకు వీలు ఉండే ఎలివేటెడ్ కారిడార్ జేబీఎస్ నుంచి మొదలు కానుంది. ఇక్కడి నుంచి డబుల్ డెక్కర్ మీదుగా తూంకుంట వద్ద ముగియనుంది. ఇందులో కింద మార్గంలో రోడ్ వే, పై వరుసలో మెట్రో అందుబాటులోకి రానుంది. ఇప్పటివరకు ఇదంతా సాఫీగానే సాగినా... హకీంపేట్ ఎయిర్‌పోర్టు ప్రాంతం ఇప్పుడు కీలకంగా మారింది. హకీంపేట్ దాటిన తర్వాత ఉండే తూంకుంట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలంటే.. ఎయిర్‌పోర్టు సమీపంలో ఎలివేటెడ్‌కు ఆస్కారం లేకుండా అండర్ గ్రౌండ్ టన్నెల్ ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లను నిర్మించడం వలన భవిష్యత్తులో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందించినట్లుగా తెలిసింది.

టన్నెల్ పైనే మెట్రో మార్గం..

హకీంపేట్ ఎయిర్‌పోర్టు కంటే ముందే ఎలివేటెడ్ కారిడార్ ముగియనుండగా.. ఇక్కడ టన్నెల్ రోడ్ వేను నిర్మించే ప్రతిపాదనలు ఉన్నట్లుగా తెలిసింది. ఇదే గనుక జరిగితే.. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో మెట్రో భూభాగంపై పరుగులు పెట్టి అక్కడి నుంచి మరోసారి ఎలివేటెడ్ మెట్రో లైన్ మొదలు కానుందనీ తెలిసింది. ఎయిర్‌పోర్టుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం జరుగుతుందని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి.

అభివాదం చేస్తున్న వేములవాడ మదన్‌మోహన్,లాలుకోట వెంకటాచారి, చొల్లేటి కృష్ణామాచార్యులు

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు.. 1000 కోట్లు ఇవ్వాలి

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం డిమాండ్

రవీంద్రభారతి, జనవరి 22 : విశ్వకర్మల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు 1000 కోట్లు కేటాయించి పాలకమండలిని ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం డిమాండ్ చేసింది. బుధవారం బషీర్‌బాగ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణామాచార్యులు విచ్చేసి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులుగా అన్ని రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కార్పొరేషన్‌కు 1000కోట్లు కేటాయించి పాలకమండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశామన్నారు. కమ్మర, వడ్రంగం ఇత్తడి, శిల, స్వర్ణకార సంప్రదాయ పంచదాయి (పంచానణం) చేతి వృత్తిదారులకు రూ.5000 పింఛను స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. దేవాలయాల కమిటీలలో శిల్ప శాస్త్ర పరిజ్ఞానం కలిగిన విశ్వకర్మలను ధర్మకర్తలుగా నియమించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు.ప్రొఫెసర్ జయశంకర్‌సార్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులిగిళ్ల శ్రీనివాసచారి, పబ్బోజు భిక్షపతి, దేవరకొండ వీరాచారి, రాళ్ళబండి విష్ణు చారి,నెళ్ళోజు సాల్వాచారి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న నిఫ్ట్ డైరెక్టర్, ప్రొఫెసర్ మాలిని దివాకల తదితరులు

నిఫ్ట్‌లో 40వ వార్షిక వేడుకలు

, జనవరి 22 : భారత ప్రభుత్వం భారతీయ టెక్స్‌టైల్స్ పరిశ్రమపై దృష్టి సారించిందని నిఫ్ట్ డైరెక్టర్, ప్రొఫెసర్ మాలిని అన్నారు. మాదాపూర్‌లోని నిఫ్ట్‌లో బుధవారం 40వ ఫౌండేషన్ డే వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిఫ్ట్ డైరెక్టర్, ప్రొఫెసర్ మాలిని దివాకల విచ్చేసి ప్రొఫెసర్, డాక్టర్ పృథ్వీరాజ్ మల్, జాయింట్ డైరెక్టర్ రామ్ మోహన్, ప్రొఫెసర్ కెకె బాబుతో పాటు నిఫ్ట్ అధ్యాపక బృందంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధునాతన డిజైన్ సెన్సిబిలిటీలతో సాంస్కృతిక నైపుణ్యాన్ని జోడించడంలో విజన్ నెక్స్ట్స్ భారతదేశాన్ని ట్రెండ్ ఫోర్ కాస్టింగ్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉంచే లక్ష్యంతో ఉందన్నారు. అనంతరం నిఫ్ట్ 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయాలు, మైలురాళ్ళు వ్యక్తీకరించే చిత్రాలను ప్రదర్శించారు.

25న తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల మహాసభ

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఈనెల 25న తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల మహాసభ జరుగుతుందని, ఈ సభలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణతో పాటు డైరీని ఆవిష్కరిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు జీసీ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం మూడుగంటల వరకు లక్డికాపూల్‌లోని ఫ్యాప్సిభవన్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి, బీర్ల ఐలయ్య, విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి సిహెచ్ రామాంజనేయులు, మాస్టర్ ప్లాన్ సిజిఎం చక్రపాణి, తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి కాంతారావు, మాజీ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డ్ కార్యదర్శి నక్క యాదగిరి, తెలంగాణ ఎలక్ట్రికల్ కంపెనీ ప్రతినిధులు, కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

గిడుగు రామమూర్తి చిరస్మరణీయుడు

చిక్కడపల్లి, జనవరి 22 : తెలుగు భాషకు గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి అని అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు వర్ధంతి వేడుకలు బుధవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు జాతీయ పురస్కారాలు ప్రదానోత్సవం, కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి హాజరై ప్రసంగించారు. సభాసమ్రాట్ కళారత్న బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ రాందాస్ తేజవత, ప్రముఖ రచయిత్రి విజయలక్ష్మి, వ్యక్తిగత వికాస నిపుణులు డాక్టర్ వర్ల, విమలం సాహిత్య సమితి డాక్టర్ జెల్లి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులతో ఐసీఎఫ్ఆర్ఈ డైరెక్టర్ జనరల్ కంచన్ దేవి, ఐఎఫ్‌బి డైరెక్టర్ ఇ.వెంకటరెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ సీసీఎఫ్ (ఉత్పత్తి) జి.రామలింగం తదితరులు

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం

ఐసీఎఫ్ఆర్ఈ డైరెక్టర్ జనరల్ కంచన్ దేవి..

జూబ్లీహిల్స్, జనవరి 22 : అంతరించిపోతున్న అడవులను, జీవరాసులను కాపాడుకునేందుకు జీవ వైవిధ్య పరిరక్షణ, నిర్వహణ అత్యంత ఆవశ్యమని డెహ్రాడూన్‌లోని భారతీయ అటవీ పరిశోధన-విద్యామండలి (ఐసీఎఫ్ఆర్ఈ) డైరెక్టర్ జనరల్ కంచన్ దేవి, ఐఎఫ్ఎస్ పేర్కొన్నారు. అటవీ జీవ వైవిధ్య సంస్థ ఆధ్వర్యంలో నగరంలో బుధవారంతో ముగిసిన 3 రోజుల 'గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్', ''కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'' వర్క్‌షాప్‌లో ఐఎఫ్‌బి డైరెక్టర్ ఇ.వెంకటరెడ్డితో కలిసి పాల్గొని ప్రసంగించారు. దేశంలోని 10 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 18 మంది అధికారులు ఈ ఉన్నత స్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొని 'లక్ష్యాలు.. లక్ష్యాలు సాధించేందుకు మార్పు సిద్ధాంతం'.. ''సాధనాలు.. పద్ధతులు'' అనే అంశాలపై చర్చించారు. భారత పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ సీసీఎఫ్ (ఉత్పత్తి)జి.రామలింగం, ఐఎఫ్ఎస్‌తో కలిసి శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, చిన్నాలి కౌశల్

అరుదైన సమస్యకు అద్భుతమైన చికిత్స

నిమ్స్ చరిత్రలో మరో మైలు రాయి

ఖైరతాబాద్, జనవరి 22 : అరుదైన సమస్యకు నిమ్స్ వైద్యులు అద్భుతమైన చికిత్సను అందించారు. ఇద్దరు చిన్నారులకు కొత్త జీవితాన్ని అందించారు. నిమ్స్ ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స విభాగం ఈ ఘనతను సాదించింది. బుధవారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, ప్రొఫెసర్ డాక్టర్ షగున్, ప్రొఫెసర్ పరంజ్యోతితో కలిసి వివరాలు వెల్లడించారు. ఉప్పల్‌కు చెందిన ప్రవీణ్, అన్నపూర్ణ దంపతుల కుమార్తె నిక్షయంతి (10) రెండేండ్ల వయస్సు నుంచే అరుదైన సమస్యతో బాధపడుతున్నది. ఆమె చికిత్స కోసం పలు దవాఖానాలు తిరిగారు. ఓ ప్రైవేట్ దవాఖానలో ఆమె తలలోని స్కల్‌భాగంలో సరైన నిర్మాణం లేకపోవడంతో మెదడుపై ఒత్తిడి పెరిగి అనారోగ్య సమస్యలకు దారి తీసింది. ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేస్తే సుమారు రూ.15లక్షల వరకు ఖర్చవుతాయని చెప్పారు. దీంతో నిమ్స్ వైద్యులను సంప్రదించగా, వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు వైద్య పరిభాషలో సిండ్రామిక్ క్రానియోసైనోస్టోసిస్ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. విజయవాడకు చెందిన కృష్ణకుమార్, బాలత్రిపుర సుందరి కుమారుడు కౌశల్ (7) కూడా అలాంటి సమస్యతో బాధపడుతూ నిమ్స్‌లో చేరాడు. ఈ నెల 6 నుంచి 8వ తేదీల్లో యూఎస్‌కు చెందిన క్రానియోఫేషియల్ సర్జన్స్‌తో కలిసి నిమ్స్ ప్లాసిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స విభాగంతో కలిసి చిన్నారులకు చికిత్స నిర్వహించారు. సుమారు 5గంటల పాటు జరిగిన ఈ శస్త్రచికిత్సలు విజయవంతం కావడంతో ప్రస్తుతం పిల్లలిద్దరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు. అరుదైన వ్యాధికి సరైన చికిత్స అందించిన వైద్యుల బృందాన్ని డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అభినందించారు.

వైద్య ఆరోగ్య శాఖలో సమస్యలను పరిష్కరించాలని ఆరోగ్య ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తును బుధవారం కలిసి వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్

ఇష్టమొచ్చినట్టు రాసుకుంటే కుదరదు

నంబర్ ప్లేట్లపై ఆర్టీఏ నజర్
ఎంవీ యాక్ట్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

రూల్స్ పాటించాలంటున్న ఆర్టీఏ:

సిటీబ్యూరో : నంబర్ ప్లేట్స్‌తో జరభద్రం.. ఇష్టమొచ్చినట్టుగా నంబర్లను రాసుకుంటే ఆర్టీఏ అధికారులకు దొరికిపోట్టే. జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ కూడా చేసే ప్రమాదం ఉంది. ఇటీవల కాలంలో చాలా మంది తమ వాహనాల నంబర్‌ప్లేట్లపై ఇంగ్లిష్ అక్షరాలను పోలి ఉన్న అంకెలను అమర్చుకుంటున్నారు. మరికొందరూ నంబర్‌ప్లేట్లపై కంపెనీల పేర్లు రాసుకుంటున్నారు. ఇష్టానుసారంగా నంబర్ ప్లేట్లను అమర్చుకున్న వాహనాలు అధిక సంఖ్యలో రోడ్డెక్కుతున్నాయి. దీంతో ఆ